క్లుప్తంగా

ఘనంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట: గోల్నాక జైస్వాల్ గార్డెన్‌లోని మైసమ్మ అమ్మవారి ఆలయం 8వ వార్షికోత్సవం కన్నుల పండువగా జరిగింది. తెల్లవారు జాము నుంచే అమ్మవారికి మహా రుద్రాభిషేకం , ప్రత్యేక అలంకరణ, చండీహోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం అన్నదానం చేశారు. కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డిలు హాజరయ్యారు. ఈ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు ఎస్.రమేష్‌గౌడ్, యాదవరెడ్డి, వెంకటేష్ యాదవ్, ఇంద్రసేన యాదవ్, గోపాల్, దిలీప్‌గౌడ్‌లు పర్యవేక్షించారు.

అంబర్‌పేట్ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా వర్కాల కృష్ణ



అంబర్‌పేట: పద్మశాలి సంఘం అంబర్‌పేట నియోజకవర్గం అధ్యక్షుడిగా వర్కాల కృష్ణ ఎన్నికయ్యారు. ఆదివారం గోల్నాకలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఎన్నికల్లో కృష్ణ అధ్యక్షుడిగా గెలిచారు. అనంతరం సంఘం ఎన్నికల అధికారిగా వ్యవహరించిన హైకోర్టు న్యాయవాది, ప్రొఫెసర్ తాటికొండ వెంకట రాజయ్య ఎన్నిక పత్రాన్ని అందజేశారు. సంఘం నాయకులు డాక్టర్ మార్త రమేష్, నరేందర్, అంజయ్య, పాండురంగయ్య, అశోక్ తదితరులున్నారు.

నాయిని నరసింహ్మారెడ్డి స్మారక క్రికెట్ పోటీలు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: మాజీ హోంమంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి జయంతి సందర్భంగా వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నాయిని నర్సింహ్మారెడ్డి స్మారక క్రికెట్ పోటీలు పర్వత పురం క్రికెట్ మైదానంలో జరిగాయి. ఆదివారం జరిగిన ఈ పోటీల్లో వీఎస్‌టీ కంపెనీకి చెందిన నాలుగు టీంలు పాల్గొన్నాయి. షిఫ్ట్ నెంబర్ 2 టీమ్ ట్రోఫీని అందుకుంది. - వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్‌రావు, టీమ్ కెప్టెన్ హనీస్ అందుకున్నారు. టోర్నమెంట్ రన్నరప్‌గా షిఫ్ట్– 3 నిలిచింది. యూనియన్ నేతలు రవియాదవ్, బాబి, సురేంద్రగౌడ్, రాములు, మధుసూదన్, ప్రణతిరెడ్డి, మల్లేష్, సత్యనారాయణ తదితరులున్నారు.

మానసిక ఉల్లాసానికి సంగీతం దోహదం



గాయకులతో జ్వాలా నరసింహారావు, ఎంకె.రాము తదితరులు

చిక్కడపల్లి: మానసిక ఉల్లాసానికి సంగీతం దోహదం చేస్తుందని ముఖ్యమంత్రి ప్రధాన సమాచార అధికారి జ్వాలా నరసింహారావు అన్నారు. ఆదివారం రాత్రి స్వర్గం సంస్కృతిక సేవ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో స్వరాల సంగమం పేరిట సినీ సంగీత విభావరి కళా సుబ్బారావు కళా వేదికలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా వనం జ్వాలనరసింహారావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయ్‌మండపాక అనతి కాలంలోనే అనేక సినీ గీతాలు ఆలపించి రికార్డులను సొంతం చేసుకున్నారని కొనియాడారు. నగరంలోనే కాకుండా ఢిల్లీ రాజధానిలో కూడా అనేక కార్యక్రమాలను నిర్వహించారన్నారు. ప్రముఖ కవి డాక్టర్ ఎంకె.రాము మాట్లాడుతూ.. విజయ్ మండపాక స్వరంలో కిషోర్‌కుమార్ గళం ఛాయలు కనిపిస్తున్నాయన్నారు. గాయని, గాయకులు అనూష, స్వాతి, నీరజ, తమన్న, జ్యోతిక ఆలపించిన సినీ గీతాలు అలరించాయి. ప్రముఖ త్రినాథరావు, సంపత్, జగదీష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.



యోగా మార్గం.. ఆరోగ్య భాగ్యం

- ఆరోగ్యప్రదాయినిగా 'భారతీయ యోగా సంస్థాన్'
- పార్కుల్లో ఉచితంగా యోగా శిక్షణ
- నవ్వు నవ్వించు.. జీవించు.. జీవింపజేయు నినాదంతో ముందుకు..



జెక్‌కాలనీలో యోగాసనాలు వేస్తున్న మహిళలు

సనత్‌నగర్: నవ్వు నవ్వించు, జీవించు జీవింపజేయు అన్నదే ఆ సంస్థ నినాదం.'స్వాస్థ్' భారత్ (ఆరోగ్య భారతం)ను నెలకొల్పేందుకు 'యోగా'నే దిక్సూచి అంటూ నలుదిశలా చాటిచెబుతోంది. సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించగలిగే 'స్థిత ప్రజ్ఞత'కు మూలం యోగాసనాలేనని ఘంటాపథంగా పేర్కొంటూ ఎందరికో ఆరోగ్య దానం చేస్తోంది భారతీయ యోగ్ సంస్థాన్.

యోగా నిపుణులతో..

సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ పార్కు, లోధా అపార్ట్‌మెంట్, నక్షత్రవనం, వినాయకగ్రౌండ్, బీకేగూడ పార్కు, జెక్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ఉచితంగా యోగా శిక్షణిస్తూ ఆరోగ్య ప్రదాయినిగా మారింది. యాంత్రిక జీవనంలో శారీరక వ్యాయామం చేసే తీరిక లేకపోవడంతో సక్రమమైన పెరుగుదల లేక దేహం వికతంగా మారిపోవడం, శ్వాసకోశ వ్యాధులు దరిచేరుతున్నాయి. వీటన్నింటికీ యోగా సాధన ద్వారా చెక్ చెప్పవచ్చంటూ ఎందరికో యోగా శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలో సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ పార్కులో యోగా నిపుణులు వర్ధన్‌నాయక్ పర్యవేక్షణలో ఆయా కేంద్రాల్లో యోగా శిక్షణ కొనసాగిస్తున్నారు.

పార్కులే ప్రధాన కేంద్రాలుగా..

ఆహ్లాదకరమైన వాతావరణానికి కేరాఫ్ ఉద్యానాలు. అలాంటి వాతావరణాన్ని కేంద్రంగా చేసుకుని నగరంలో భారతీయ యోగ్ సంస్థాన్ వందలాది మందికి ఉచితంగా యోగా శిక్షణ ఇస్తోంది. ఇక పార్కులతో పాటు అపార్ట్‌మెంట్లలో సైతం ప్రత్యేకంగా మహిళలకు శిక్షణ ఇస్తూ ఒత్తిడిని చిత్తు చేస్తున్నారు. యోగా సాధన ద్వారా ఎలాంటి రుగ్మతనైనా దూరం చేయవచ్చని ఇక్కడి సాధకులు పేర్కొంటున్నారు. విద్యార్థులకు జ్ఞాపక శక్తిని పెంచే యోగాసనాలు, శరీరాన్ని తేలికపరిచి, సాధారణ ఆరోగ్యం కాపాడే యోగాసనాలు, దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బు, ఆమ్లపిత్తం, మెడ, నడుము నొప్పులు తదితర వాటిని యోగా ద్వారా తగ్గించడమే కాకుండా రాకుండా నివారించే యోగాసనాల్లో శిక్షణ అందిస్తున్నారు.

ఇక్కడ తమ నవ్వుల పువ్వులతో హాస్యరసాలను ఊరిస్తారు. నవ్వేవాడు యోగి.. నవ్వించేవాడు భోగి..నవ్వలేని వాడు లేజీ..అంటూ తమ చతురోక్తులతో పార్కుకు వచ్చే వాకర్స్‌లో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తుంటారు. తమ నవ్వుల పువ్వులతో ఇతరుల మోములపై నవ్వులను పూయించేలా చేస్తారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ యోగా వైపు మళ్లిన ఆ హృదయాలు ఇప్పుడు మరిన్ని హృదయాలకు ఊరటనిచ్చే కేంద్రాలయ్యాయి. యోగాసనాలను నేర్చుకుని మరీ తాము ఆరోగ్యం సాధించడమే కాదు ఇతరులకు ఆరోగ్యాన్ని పంచేందుకు అదే యోగాసనాలను వారికి నేర్పే స్థాయికి ఎదిగారు.

గత 20 ఏళ్లుగా..

భారతీయ యోగా సంస్థాన్ వేల మందిని యోగ శిక్షణ వైపు అడుగులు వేయించింది. ఎందరో తమ అనారోగ్య సమస్యల నుంచి బయటపడేలా చేసింది. అందరితో పాటు పార్కుల్లో యోగా చేయడమే కాకుండా స్వతహాగా ఇళ్లలో చేసుకునే విధంగా శిక్షణ ఇస్తున్నాం. కోవిడ్ సమయంలో తమ తమ ఇళ్లల్లోనే యోగాసనాలు వేసి తమ ఆరోగ్యం చెక్కు చెదరకుండా చేసుకున్నారు. 2003 నుంచి సనత్‌నగర్ ప్రాంతంలో యోగా శిక్షణ కొనసాగుతుంది. **–వర్ధన్‌నాయక్, డిస్ట్రిక్–1 అధ్యక్షుడు**



వంజర సంఘం అభ్యున్నతికి కృషి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: వంజర సంఘం అభ్యున్నతికి తన వంతు చేయూతనిస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం గోల్నాకలో జరిగిన వంజర సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ సహకారంతో వంజరి కులస్తులకు ఉప్పల్ భగాయత్‌లో స్థలం, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానన్నారు. వేములవాడలో సైతం వంజరులకు ప్రత్యేక సత్రం ఏర్పాటు చేసుకునేందుకు సహకారం అందిస్తానన్నారు. కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, వంజర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాలేరు నరేష్, ప్రధాన కార్యదర్శి వెంకటేశం అంబర్‌పేట అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గంగరాజు, ప్రతినిధులు అనిల్, నాగరాజు, బాలకృష్ణ, విష్ణువర్ధన్ తదితరులున్నారు.

బ్రాహ్మణులు విద్య, ఉద్యోగ రాజకీయాల్లో రాణించాలి



మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావును సన్మానిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వాణిదేవి

ముషీరాబాద్: బ్రాహ్మణులు సంఘటితమై విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తమకు రావాల్సిన వాటాను సాధించుకోవాలని ఎమ్మెల్సీ వాణిదేవి అన్నారు. బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం కోసం తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఆదివారం రాంనగర్ గుండు చౌరస్తాలో అడిక్‌మెట్ డివిజన్ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పరశురామ జన్మోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వాణిదేవి మాట్లాడుతూ.. పరరాముడి ఆశయాల అమలుకు బ్రాహ్మణులందరూ కృషి చేయాలన్నారు. పేద బ్రాహ్మణులను ఆదుకోవడానికి అందరూ సహకారం అందించాలని కోరారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాంచందర్‌రావు, కార్పొరేటర్ సునితా, దైవజ్ఞ శర్మ, ఎం.నాగేష్‌ముదిరాజ్, కె.మాధవ్, ఆర్.శేష సాయి, కౌండిన్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావుకు సన్మానం

నల్లకుంట: బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య (బీఎస్ఎస్ఎస్) ఆధ్వర్యంలో పరశురామ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లకుంటకు చెందిన బీఎస్ఎస్ఎస్ ప్రతినిధి బృందం సీహెచ్. లలిత కుమారి, సీత, ప్రసన్న, సీహెచ్. మురళీ కృష్ణ, శేషసాయి తదితరులు మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాంచందర్‌రావును శాలువాతో సన్మానించారు.

'ఓయూ వీసీ తీరు సరికాదు'

ఉస్మానియా యూనివర్సిటీ: పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజుల పెంపును వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నేతలను ఇటీవల జరిగిన మహనీయుల జయంతి ఉత్సవాల ముగింపు సభలో వ్యక్తిగతంగా వీసీ ప్రొ. రవీందర్ దూషించడం దారుణమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెంచిన పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజును తగ్గించాలని గత పది రోజులుగా ఆందోళనలు చేస్తున్న విద్యార్థులకు సమాధానం ఇవ్వకుండా పరిశోధన విద్యార్థి ఏఐఎస్ఎఫ్ నాయకులు నెల్లిసత్య పై వీసీ చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేయకుండా పీహెచ్‌డీ ఫీజును తగ్గించాలని లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

రేపు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసి కల్యాణ మండపంలో ముషీరాబాద్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 6 డివిజన్‌లలో విజయవంతంగా ఆత్మీయ సమ్మేళనాలను ముగించుకుని నియోజకవర్గ స్థాయిలో ఆత్మీయ సమ్మేళనానికి సన్నద్ధం అవుతున్నామన్నారు. ప్రతి డివిజన్ నుంచి 500 మందికి తగ్గకుండా నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముఠా జయసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, మోజెస్, రాకేష్, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ గుప్తా, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి: డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్‌గుప్తా, గుండు జగదీశ్‌బాబు, సత్యనారాయణ, రవిశంకర్‌గుప్తా, శ్రీకాంత్, ఎంబీ కృష్ణ, రాజ్‌మోహన్, శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టుల సంఘం నూతన కార్యవర్గం

కాచిగూడ: అంబర్‌పేట వర్కింగ్ జర్నలిస్టుల సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నికైంది. కాచిగూడ తుల్జాభవన్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జేపీ చారి), ప్రధానకార్యదర్శిగా శ్యామ్‌సుందర్, కోశాధికారిగా మహేందర్ గెలుపొందారు. ఎన్నికల అధికారిగా దత్తాత్రి వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అంబర్‌పేట వర్కింగ్ జర్నలిస్టుల సంఘానికి ప్రాముఖ్యత ఉందని ఈ ప్రతిష్టను నిలబెట్టేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. సంఘానికి సుదీర్ఘకాలంగా సేవలందించిన సంఘం మాజీ అధ్యక్షుడు పుల్లా అబ్బయ్య చేసిన సేవలను సంఘం ప్రతినిధులు ఈ సందర్భంగా అభినందించారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

కాచిగూడ: ఓ ఇంట్లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంటకు చెందిన సిద్ధాంతరామ్ శ్రీ వాస్తవ (32) బర్కత్‌పురలోని ఓ హోటల్‌లో నిబంధనలకు విరుద్ధంగా గత కొద్ది రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం రాత్రి హోటల్‌లో తనిఖీలు చేసి అతని నుంచి రూ.17వేల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం కాచిగూడ పోలీసులకు అప్పగించారు. ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాంబాబు తెలిపారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ వైఎంసీఏలో ఈ నెల 24వ తేదీ నుంచి వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు జయకర్ డేనియన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. 5 సంవత్సరాల నుంచి 16 ఏళ్ల బాలా బాలికలు పాల్గొనవచ్చన్నారు. స్పోర్ట్స్, కల్చర్, ఇంటలెక్చువల్, యోగా లాంటి అనేక యాక్టివిటీస్ నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ అందిస్తామన్నారు.

'రెయిన్‌బో' పుస్తకావిష్కరణ



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రముఖ రచయిత బిట్టు బీకే రచించిన 'రెయిన్‌బో' పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రచన ముద్రబోయిన ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని విరసం సభ్యురాలు వరలక్ష్మి తెలుగులో అనువదించారు. ఈ సందర్భంగా రచన మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్‌ల ఉద్యమం 2014లో మొదలై 2016లో పోరాట రూపంగా మారిందన్నారు. సభకు రామచంద్రం అధ్యక్షత వహించారు.

వచ్చే ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యమివ్వాలి

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భానుప్రకాష్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వచ్చే ఎన్నికల్లో ముదిరాజ్‌లకు రాజకీయంగా అన్ని పార్టీలు తగిన ప్రాధాన్యత కల్పించాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భానుప్రకాష్ డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం ముదిరాజ్‌లకు సీట్లు కేటాయించాలని నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముదిరాజ్ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో ముదిరాజ్ యువత ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లకు విద్య, ఉద్యోగాల్లో రావాల్సిన రిజర్వేషన్‌లపై చాలా రోజులుగా పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.

- రిజర్వేషన్‌లలో అన్యాయం జరగడం వల్ల ముదిరాజ్ యువత చదువుకు దూరం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.
- మరోవైపు ఉన్నత చదువులు చదివినా.. నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
- రాష్ట్రంలో 56 లక్షలకు పైగా ఉన్న ముదిరాజ్‌లను రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయన్నారు.
- అనేక గ్రామాల్లో ముదిరాజ్‌లు అన్యాయాలకు గురవుతున్నారని చేపల చెరువుల్లో దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని తెలిపారు.
- చేప పిల్లలకు సంబంధించి ప్రైవేటు కాంట్రాక్టు వ్యవస్థలను ప్రోత్సహిస్తూ.. చేప పిల్లల పంపిణీలో దోపిడి చేస్తున్నారని విమర్శించారు.
- ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడు వై.శివముదిరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కాసాని వీరేష్, పుష్పలత, తెలంగాణ జన సమితి నాయకులు నిజ్జల రమేష్, ప్రదీప్, కురుమూర్తి, రమేష్‌ముదిరాజ్ తదితరులున్నారు.

మన్‌కీ బాత్ ప్రజల్లోకి వెళ్లేలా చూడాలి



మాట్లాడుతున్న బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు

అంబర్‌పేట: ప్రధానమంత్రి మాన్‌కీబాత్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చూడాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు సూచించారు. దీనికి పోలింగ్ బూత్‌స్థాయిలో పార్టీ పటిష్టతకు బూత్ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ పార్టీ బూత్‌కమీటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ బి.వెంకట్‌రెడ్డి, నాయకులు మూల రవీందర్‌గౌడ్, నర్సింగ్‌రావు యాదవ్, ఎం.శ్యామ్‌రాజ్, సుదర్శన్, రామ్‌చందర్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

'జై భీమ్ ప్రజా సేవ సమితి' ఆవిర్భావం



పేదలకు చీరలను పంపిణీ చేస్తున్న రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: జై భీమ్ ప్రజా సేవా సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కాచిగూడ, చెప్పల్‌బజార్‌లో ఘనంగా జరిగాయి. ఆదివారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనాథ్ ఆధ్వర్యంలో పేదలకు చీరలను పంపిణీ చేసి అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య పాల్గొని 'జై భీమ్ ప్రజా సేవా సమితి'ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జై భీమ్ సంస్థ పనిచేయాలని సూచించారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా పేదలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ఆ దిశగా స్వచ్ఛంద సేవా సంస్థలు కృషి చేయాలన్నారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్, శ్రీకాంత్, జై కృష్ణ, పరివర్తన్, కిరణ్‌కుమార్, జైపాల్, సంతోష్, భాస్కర్, సతీష్, మిట్టు తదితరులున్నారు.

ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి



బసవేశ్వర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి

కవాడిగూడ: అణగారిన వర్గాల అభ్యున్నతితో పాటు 12వ శతాబ్దంలోనే కులరహిత సమాజం కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి మహాత్మ బసవేశ్వరుడని పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బసవేశ్వర 890 వ జయంతి సందర్భంగా ఆదివారం ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వర విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేటి సమాజం బసవేశ్వర ఆశయాలు, సిద్ధాంతాలను ఆచరించి ముందుకు సాగాలని సూచించారు. వీరశైవ లింగాయత్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడు సమసమాజ స్థాపనకు కృషి చేశారు..

ముషీరాబాద్: బసవేశ్వర సమసమాజ స్థాపన కోసం ఎనలేని కృషి చేశారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం వీరశైవ సమాజం ఆధ్వర్యంలో వీరశైవ సమాజం సీనియర్ నాయకులు వీరేష్ సారధ్యంలో బసవేశ్వర 890 జయంతి వేడుకలను ముషీరాబాద్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని కులాల సమానత్వం, కుల రహిత సమాజ స్థాపనకు ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి హరిబాబుయాదవ్, యువజన నాయకులు ముఠా జైసింహ, వీరశైవ సమాజ నగర నాయకులు కళ్యాణ్,, శివకుమార్, జంగమ సమాజం అధ్యక్షులు విశ్వేశ్వరయ్య, శివముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, గౌరి శంకర్ తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 29న ఇంధిరా పార్కు ఉదయం 10 గంటలకు నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజవంతం చేయాలని 'ఐలు' రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ పిలుపునిచ్చారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు. ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.పార్థసారధి, నగర కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు ప్రవీణ్, వెంకటేష్, గణేష్, స్టాలిన్, ఈశ్వర్ జితేంద్ర, సుదర్శన్ తదితరులున్నారు.

సాయిబాబా దేవాలయ వార్షికోత్సవ వేడుకలు



విశ్వంజీ మహరాజు, ఆలయ చైర్మన్ మండలపు గాంధీ తదితరులు

కవాడిగూడ: సమాజంలో ప్రతి ఒక్కరూ మానవ వికాసానికి దోహదపడి చెడును పారద్రోలాలని విశ్వంజీ మహరాజ్ సాయి భక్తులకు పిలుపునిచ్చారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్ సాయిబాబా దేవాలయ 27వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ మండలపు గాంధీ, సలహాదారులు హైకోర్టు సీనియర్ న్యాయవాది వినయ్‌కుమార్‌లు ఉదయం 8 గంటలకు అమృత కలశాలతో బాబాకు అభిషేకం, హారతి ప్రత్యేక పూజలు చేసి అనంతరం అన్నదానం చేశారు. దైవజ్ఞశర్మ, పద్మజ, జూపల్లి రాజశేఖర్, చంద్రశేఖర్, సాయి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.